హైదరాబాద్ అతలాకుతలం

- దంచికొట్టిన వాన
- చెరువులను తలపించిన రోడ్లు
- కొట్టుకుపోయిన వాహనాలు
- జిల్లాల్లో తడిసిన ధాన్యం
- పిడుగుపాటుకు నలుగురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌తోపాటు జిల్లాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి భారీ నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అప్పటి వరకు ఉక్కపోతగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడి భారీ వర్షం పడింది. పంటలు తడిసి రైతులు తీవ్రంగా నష్టపోగా.. మరోవైపు పిడుగులు పడి నలుగురు ప్రాణం కోల్పోయారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం జడివానలా దంచికొట్టింది. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నాలాలు పొంగిపొర్లాయి. వాహనాలు కొట్టుకుపోయాయి.

మహబూబ్‌నగర్, భూత్పూర్, వనపర్తి ప్రాంతాల్లో మోస్తారు వర్షం కురిసింది. భూత్పూర్ ప్రాంతంలో గాలి దుమారానికి చెట్లు విరిగిపడ్డాయి. ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల జొన్న పైరు నేలకొరిగింది. ఇంద్రవెల్లి మండలంలోని లాల్‌టెకిడి గ్రామంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కారణంగా ఇండ్లపై కప్పులు పడిపోయాయి. ధాన్యం తడిసి ముద్దయింది. ఈశ్వర్‌నగర్ గ్రామం వద్ద ప్రధాన రోడ్డుపై చెట్టు విరిగిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది.

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ ప్రాంతంలో సాయంత్రం భారీ వర్షానికి ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆరంగర్ నుంచి అత్తాపూర్ వరకు రోడ్లకు ఇరువైపులా వర్షపు నీరు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఉప్పరపల్లి ప్రధాన రోడ్డుపైన చెరువులు తలపించేలా వర్షపు నీరు ఉండటంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. శివరాంపల్లి రోడ్డు వద్ద వర్షపు నీరు భారీగా రోడ్డుపై నిలవడంతో రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసీ కమిషనర్ సిబ్బందితో అక్కడకు చేరుకొని మ్యాన్‌హోల్‌లో చెత్తను తొలగించడంతో వర్షపు నీరు వెళ్లిపోయింది. బాబుల్ రెడ్డినగర్‌లోని కొన్ని ఇండ్లలోకి వర్షపు నీరు వచ్చింది. నర్సాబాయ్ కుంట వద్ద ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులు వేసిన పైప్‌లైన్ అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికి డ్రైనేజీ నిండి నీరు ఇండ్లలోకి వస్తోంది.

సిద్ధిపేట జిల్లా మర్కుక్, తొగుట మండల పరిధిలోని ఐకేపీ కేంద్రాలలో ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం కొట్టుకుపోయింది. గజ్వేల్‌లో వర్షానికి చెట్లు విరిగి వాహనాలపై పడ్డాయి. మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధిలో బుధవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన జెల్ల యాదగిరికి చెందిన ఆవు పిడుగుపాటుకు మృత్యువాత పడింది. పాపన్నపేట మండలం అరేపల్లి గ్రామానికి చెందిన మస్కరి హన్మంతు జీవాలు పొలంలో మేత మేస్తుండగా.. పిడుగు పడటంతో మేకలు మృత్యువాతపడ్డాయి. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం బిలాల్‌పూర్, తదితర గ్రామాల్లో బలమైన ఈదురు గాలులు వీచడంతో అరటితోటల్లో చెట్లు విరిగాయి. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలో మామిడి కాయలు రాలాయి.

అతలాకుతలమైన నగరం

హైదరాబాద్ నగరంలో వర్షం దంచికొట్టింది. గురువారం సాయంత్రం గంటపాటు కురిసిన వర్షానికి నగరం అతలాకుతలమైంది. పలుచోట్ల నాలాలు, మ్యాన్ హోల్స్ పొంగి పొర్లాయి. పలు ప్రాంతాల్లో మోకాలిలోతు నీరు చేరడంతో రహదారులపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆర్‌టిసి క్రాస్‌రోడ్‌లోని స్టీల్ బ్రిడ్జితోపాటు పంజాగుట్ట, బేగంపేట వద్ద రహదారిపై భారీగా వరద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బంజారాహిల్స్ డివిజన్‌లోని ఉదయనగర్ కాలనీలో నాలా స్లాబ్ కొట్టుకుపోయింది. వరద ఉధృతికి అదే ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. వెంటనే అప్రమత్తమైన జిహెచ్ఎంసి అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పరిసర ప్రాంతాల్లో అత్యధికంగా 9.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కొట్టుకుపోయిన రోడ్లు, కూలిన నాలా కప్పులు

బంజారాహిల్స్‌లోని రోడ్ నెంబర్ 9, 11లో వరద ఉధృతికి నాలా పై కప్పు కొట్టుకుపోయింది. దాంతో ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. బల్కంపేటలో రైల్వే అండర్‌పాస్ కింద వరద నీటిలో కారు మునిగిపోయింది. మలక్‌పేట రైల్వే బ్రిడ్జి కింద భారీగా వరద నీరు నిలిచిపోయింది. రైల్వే అండర్‌పాస్ కిందకు నీరు చేరడంతో దిల్‌సుఖ్‌నగర్ కోఠి మార్గంలో ఇరువైపుల రాకపోకలు నిలిచిపోయాయి. కోఠి, చాదర్‌ఘాట్, మలక్‌పేట ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. గచ్చిబౌలి, బయో డైవర్సిటీ, ఐకియా, విప్రో జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, రోడ్డు నంబర్ 45, బేగంపేట, పంజాగుట్ట సహా పలు చోట్ల భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. మాదాపూర్ నెక్టార్ గార్డెన్, శిల్పారామం సైబర్ గేట్ వే రోడ్లపై వరద నీరు నిలిచిపోయింది.

అప్రమత్తం చేసిన బల్దియా

జిహెచ్ఎంసి అధికారులు అప్రమత్తమయ్యారు. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ నగరంలో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, నేలకొరిగిన వృక్షాలను తొలగించాలని జోనల్ కమిషనర్లను, డీసీలను ఆదేశించారు. డీఆర్ఎఫ్ బృందాల చర్యల కోసం 040-21111111 లేదా 9000113667 నెంబర్లను సంప్రదించొచ్చని తెలిపారు.

పిడుగు పాటుకు నలుగురు మృతి

కల్వకురిలో పిడుగు పడి ఒకరు మృతి చెందారు. మరొకరు అపస్మారక స్థితిలోకెళ్లారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి చెందిన పసునూరి ప్రవీణ్(30) అతని మామ నాగోజు జంగయ్యతో కలిసి గురువారం సాయంత్రం కడ్తాల్ నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వర్షం రావడంతో మార్గమధ్యలోని వాసుదేవ్‌పూర్ గేట్ బస్టాండ్ వద్ద నిలబడగా సమీపంలో పిడుగు పడింది. ఆ శబ్దానికి ప్రవీణ్ కింద పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే నిలుచున్న మాడ్గుల మండల కేంద్రానికి చెందిన జి.నిరంజన్‌కి కూడా గాయాలవ్వగా.. కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారీ వర్షం రైతుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఓ వైపు పంటలు దెబ్బతినగా.. మరోవైపు పిడుగులు పడి ఇద్దరు రైతులు మృతిచెందారు. మరో నలుగురు గాయపడ్డారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన కంబల్ల శ్రీనివాస్, కొమరవ్వ, ఎల్లవ్వ, దేవయ్య, శ్రీనివాస్ వ్యవసాయ పనులకు వెళ్లారు. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగు పడటంతో కంబల్ల శ్రీనివాస్(32) అక్కడికక్కడే మృతిచెందాడు. స్వల్పంగా గాయపడిన నలుగురిని వేములవాడలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పాక్స్ చైర్మెన్ ఏనుగు తిరుపతి రెడ్డి పరామర్శించారు.

తంగళ్ళపల్లి మండలం ఇందిరానగర్ గ్రామపంచాయతీ పరిధిలోని భరత్‌నగర్ గ్రామానికి చెందిన రైతు రుద్రారపు చంద్రయ్య(50) వ్యవసాయ పొలంలో చేస్తున్న క్రమంలో వర్షంతోపాటు పిడుగు పడింది. దాంతో ఆయన అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలో రైతు ఎనుగుల మల్లయ్యకు చెందిన ఆవు, దూడ పిడుగుపాటుతో మృత్యువాత పడ్డాయి.

అంజిరెడ్డికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సమాజ మార్పు కోసం పోరాడే వారే కమ్యూనిస్టులు

- అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి
- నన్నూరి అంజిరెడ్డి సంతాప సభలో తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దోపిడీ, అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం నిరంతరం పోరాడే వారే కమ్యూనిస్టులు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఏ దుప్పలపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం సిపిఎం సీనియర్ నాయకులు నన్నూరి అంజిరెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. నిరంతరం పేదల హక్కుల కోసం పోరాడిన అంజిరెడ్డి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. వారి ఆశయాలు, ఆదర్శాలు యువతరానికి మార్గదర్శకమని తెలిపారు. తన జీవితకాలం ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తూ మరణానంతరం మృతదేహాన్ని మెడికల్ కళాశాల విద్యార్థుల కోసం అందజేయడం అభినందనీయమన్నారు. కమ్యూనిస్టులు ఎక్కడున్నా.. సమాజ మనుగడ కోసం.. కూడు, గూడు, ఉపాధి, ఉచిత విద్య, వైద్య సదుపాయాల కోసం పనిచేస్తారని చెప్పారు. రాజకీయాల్లోకి బడా కార్పొరేట్ కంపెనీల అధినేతలు చొరబడి కలుషితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సమాజంలో ఉపాధి కరువై కనీస వేతనాలు అందని పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేవారు. విద్య, వైద్యం ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉండటంతో సామాన్యులు జీవించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అందరికీ ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించగలిగే దోపిడీ రహిత సమసమాజ నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. నన్నూరి అంజిరెడ్డి 40 ఏళ్ల రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల్లో అవిశ్రాంతంగా పనిచేశారని చెప్పారు. పేదలకు భూముల పంపిణీ, వ్యవసాయ కార్మికుల కూలిరేట్ల పెంపు కోసం అనేక ఉద్యమాలు నిర్మించారని తెలిపారు. ప్రజలకు సేవచేసి వారి అభిమానాన్ని పొందడమే నిజమైన జీవితమని, అలా అంజిరెడ్డి ప్రజాభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. తన ఇంటినే సిపిఎం కార్యాలయంగా మార్చుకుని పేదలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమాల ద్వారా అనేక మందిని కార్యకర్తలుగా తీర్చిదిద్దారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నాయకులు బండ శ్రీశైలం, సయ్యద్ హాశిం, పాలడుగు నాగార్జున, చిన్నపాక లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి, ఊట్కూరి నారాయణరెడ్డి, ఎండి. సలీం, గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్ని రకాల వడ్లకు బోనస్ వర్తింపచేయాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సన్న బియ్యం పండించే రైతులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నట్టు వార్తలొస్తున్నాయని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురౌతున్నదని పేర్కొన్నారు. గురువారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిందని, రైతులు తల్లడిల్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న ఐదు రోజులు భారీ వర్షాలుంటాయంటూ వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నదని తెలిపారు. అందువల్ల రైతులు మరింత నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సూచించారు. రాష్ట్రంలో పండించే ధాన్యంలో 20 శాతం మాత్రమే సన్నబియ్యం పండించే రైతులు, 80 శాతం దొడ్డు బియ్యం పండించే రైతులున్నారని వివరించారు. వాళ్ల అత్యధికులు సన్న, చిన్నకారు రైతులేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తామంటూ వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. సన్న బియ్యం లేదా దొడ్డు బియ్యం గురించి ప్రస్తావించలేదని తెలిపారు. ఇపుడు సన్న బియ్యం పండించే రైతులకు మాత్రమే బోనస్ వర్తిస్తుందనే వార్తలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. అన్ని రకాల వడ్లు పండించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ యాసంగి పంటకు బోనస్ చెల్లింపును వర్తింపచేయాలని సూచించారు. రైతుల్లో ఉన్న ఆందోళనను తొలగించడం కోసం ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటనను చేయాలని కోరారు.

ఆదాయం పెంపుపై దృష్టిపెట్టండి

- పన్ను ఎగవేతలపై కఠిన చర్యలు తీసుకోండి
- మద్యం అమ్మకాలు పెరిగినా అదాయం ఎందుకు తగ్గుతోంది?
- మార్కెట్ ధరలకనుగుణంగా భూముల ధరలు సవరించండి
- వాణిజ్య పన్నుల శాఖలో అవినీతిని అరికట్టండి
- ఉన్నత స్థాయి సమీక్షలో సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ పెంపుపై అన్ని విభాగాలు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల అధికారులతో సిఎం సమీక్ష నిర్వహించారు. గతేడాది వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదని ఈ సందర్భంగా ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. బడ్జెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకానెల లక్ష్యాన్ని నిర్దేశించుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు పన్నుల ఎగవేత లేకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆదాయం పెచేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్రానికి రాబడి తెచ్చిపెట్టే జిఎస్‌టి ఎగవేత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆదాయం పెంచేందుకు క్షేత్ర స్థాయిలో నిత్యం తనిఖీలు, ఆడిటింగ్ చేయాలని పేర్కొన్నారు. జిఎస్‌టి ఎగవేతదారులు ఎంతటివారైనా ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా వ్యవహరించాలని ఆదేశించారు. వాణిజ్య శాఖలో ఇంతకాలం జరిగిన పొరపాట్లు పునరావృతం కావద్దని, జిఎస్‌టి రిటర్న్ పేరిట వెలుగులోకి వస్తున్న అవినీతి అక్రమాలకు తావు లేకుండా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించారు. గతేడాది ఎన్నికల సీజన్లో మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినా లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరగకపోవటానికి గల కారణాలపై సీఎం ఆరా తీశారు. మద్యం, ఇసుక, అక్రమ రవాణా, పన్ను ఎగవేత లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తం భూములు, స్థిరాస్తుల ధరలు భారీగా పెరిగినా, అదే స్థాయిలో రెవెన్యూ ఆదాయం ఎందుకు పెరుగడంలేదని ఈ సందర్భంగా సిఎం అధికారులను ప్రశించారు. గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచిందనీ, ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉందని అధికారులు సిఎం తెలిపారు. నిబంధనల ప్రకారం ఏడాదికోసారి భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉన్న నేపథ్యంలో తగిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్మెంట్లు వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారించి నిబంధనల ప్రకారం పెంచాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న స్టాంప్ డ్యూటీ కూడా అధ్యయనం చేయాలని సీఎం పేర్కొన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరతను అధిగమించడంతో పాటు సొంత భవనాలు లేని వాటికి మోడల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మించాలని ఆదేశించారు. అధికారులు కలిసి కట్టుగా సర్కార్ ఆదాయాన్ని పెంచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జెట్ ఎయిర్‌వేస్ నరేష్ గోయల్ భార్య మృతి

ముంబయి : జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకులు నరేష్ గోయల్ భార్య అనితా గోయల్ మరణించారు. గత కొంతకాలంగా ఆమె క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ముంబయిలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ.. ఆరోగ్యం క్షీణించడంతో గురువారం కన్నుమూశారు. నరేశ్ గోయల్ కూడా గత కొన్ని రోజులుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. కెనరా బ్యాంక్‌కు రూ.539 కోట్ల అప్పుల చెల్లింపుల్లో నరేష్ గోయల్ విఫలం కావడంతో పాటు బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలను మనీలాండరింగ్‌కు ఉపయోగించిన ఆరోపణలపై సిబిఐ, ఇడి విచారణ జరుపుతోంది. ఈ కేసులో ఇడి నరేష్ గోయల్‌ను గత సెప్టెంబర్‌లో అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి జైల్లో ఉన్న ఆయన భార్య అనారోగ్యం కారణంగా కొద్ది రోజుల క్రితమే బెయిల్‌పై బయటకు వచ్చారు.

టెక్ మహీంద్రా మాజీ బాస్ వినీత్ నయ్యర్ మృతి

ముంబయి : టెక్ మహీంద్రా లిమిటెడ్ మాజీ సిఇఒ వినీత్ నయ్యర్ (85 ఏళ్లు) మృతి చెందారు. ఐఎఎస్ అధికారిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆయన తన 40 ఏళ్ల కెరీర్‌లో అనేక ప్రభుత్వ, ప్రయివేటు కార్పొరేట్ రంగాల్లో పనిచేశారు. 2009లో సత్యం కంప్యూటర్స్ కుప్పకూలిన సమయంలో ఆ సంస్థను టెక్ మహీంద్రాలో విలీనం చేయడంలో కీలక పాత్ర పోశించారు. వినీత్ మృతికి టెక్ ఇండస్ట్రీ బాడీ నాస్కామ్ సంతాపం తెలిపింది. భారతీయ వ్యాపార రంగంలో వినీత్ అతి పెద్ద వ్యక్తి అని మహీంద్రా గ్రూపు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో డబ్ల్యుఎస్ఎ ఆర్అండ్‌డి సెంటర్ ఏర్పాటు

ప్రజాశకి-హైదరాబాద్

వినికిడి సహాయ పరిశ్రమలోని డబ్ల్యుఎస్ ఆడియాలజీ (డబ్ల్యుఎస్ఎ) హైదరాబాద్‌లో తన కొత్త రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డి) సెంటర్‌ను ఏర్పాటు చేసింది. దీనిని గురువారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ లాంఛనంగా ప్రారంభించారు. కంపెనీ విస్తరణలో భారత్‌లో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అని ఆ సంస్థ తెలిపింది. నూతన ఆర్అండ్‌డి కేంద్రం తమ నెట్‌వర్క్‌లో ఎంతో కీలకమైనదని, వినియోగదారు అనుభవాలు, ఫలితాలను గణనీయంగా మెరుగుపరచడానికి అత్యాధునిక సాంకేతికతలతో తమ ఉత్పత్తి అభివద్ధిని మెరుగుపరుస్తుందని డబ్ల్యుఎస్ ఆడియాలజీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ జోర్గ్ బ్రాండ్‌షేడ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. భారత్‌లో 6.3 శాతం మంది వినికిడి సమస్యతో బాధపడుతున్నారన్నారు. ఈ కొత్త హబ్ కేవలం మౌలిక సదుపాయాలపై పెట్టుబడి మాత్రమే కాదని, ఇది టాలెంట్ డెవలప్‌మెంట్, రీసెర్చ్, స్థానిక సంస్థలతో సహకారం కోసం నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. వినికిడి పరిష్కారాలను అభివద్ధి చేయడానికి స్థానిక మార్కెట్ అవసరాలతో ప్రపంచ సాంకేతిక ధోరణులను సమతుల్యం చేయడానికి అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. 250 మందికి పైగా ఇంజనీర్ల సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని తీర్చిద్దిద్దామన్నారు.

పేద విద్యార్థులకు సింక్రోనీ సిబ్బంది సాయం

హైదరాబాద్ : ఆర్థిక సేవల సంస్థ సింక్రోనీ ఉద్యోగులు 200 ఎడ్యుకేషన్ కిట్‌లను పేద విద్యార్థులకు అందించారు. యంగిస్తాన్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో పట్టణ మురికివాడలలో నివసించే పాఠశాలకు వెళ్లే పిల్లలకు మద్దతునిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. కిట్‌లలో స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు, స్టేషనరీ బాక్సులు, స్నాక్ బాక్స్‌లు, నోట్‌బుక్‌లు, న్యూట్రిషన్ బార్‌లు, వారి ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపే ఇతర వస్తువులు ఉన్నాయని పేర్కొంది. సింక్రోనీ తమ వార్షిక ఇండియా గ్లోబల్ డైవర్సిటీ ఎక్స్పీరియన్స్‌లో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపింది. నెట్‌వర్కింగ్ అవకాశాలు, కమ్యూనిటీ సర్వీస్ వర్క్‌షాప్ మరియు సింక్రోనీ నాయకత్వంతో ప్యానెల్ చర్చలు జరిగాయని తెలిపింది.

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సన్న వడ్లకే కాదు...అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. కేవలం సన్న వడ్లకు బోనస్ ఇస్తారంటూ జరుగుతున్న ప్రచారంతో రైతుల్లో గందరగోళం ఏర్పడిందని పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, తీగల సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు.రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిందని తెలిపారు. ఇప్పుడు కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం విడ్డూరమని పేర్కొన్నారు. 80 శాతం మంది రైతులు దొడ్డు వడ్లు, 20 శాతం సన్న వడ్లను పండిస్తారని తెలిపారు. ఇందులో అత్యధికం సన్న చిన్నకారు రైతులే ఉన్నారని పేర్కొన్నారు. రైతాంగానికి నష్టం జరగకుండా వడ్లు పండించిన వారందరికీ ఒకే రకంగా బోనస్ చెల్లించాలని కోరారు. ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న యాసంగి పంటలకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని కోరారు. అన్ని వడ్లకు ఒకే రకమైన బోనస్ చెల్లించని పక్షంలో రైతాంగాన్ని కూడగట్టి ఆందోళనా పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

బిఆర్ఎస్ 'బోనస్' నిరసన

- రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులు పండించిన అన్ని రకాల వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సన్న వడ్లకే బోనస్ ఇస్తామని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పడం సరికాదని, దొడ్డు వడ్లకి కూడా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేయాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. దేరకొండ పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేపట్టారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేశారు. కాగజ్‌నగర్‌లోని వంజరి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆధ్వర్యంలో ర్యాలీ తీసి.. చౌరస్తాలో నిరసన తెలిపారు. బోథ్ మండల కేంద్రంలో తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతిపత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లాలో బిఆర్ఎస్ నాయకులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిరసన తెలిపారు. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం గట్టెపల్లిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. తాండూర్ మండలం చెంగోల్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని వేములవాడ, సిరిసిల్ల, మానకొండూర్, చొప్పదండి, రామగుండం (గోదావరిఖని), పెద్దపల్లి, మంథని, జగిత్యాల, మెట్‌పల్లి నియోజకవర్గ కేంద్రాల్లో బిఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు రకం ధాన్యాన్ని పండిస్తారని తెలిసి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని మెలికపెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వానకు ధాన్యం తడుస్తోందని, వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

45 రోజుల పసికందుకు అరుదైన శస్త్ర చికిత్స

- మెడికవర్ హాస్పిటల్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

రెండు నెలలు కూడా నిండని పసికందుకు అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు మెడికవర్ ఉమన్ అండ్ చైల్డ్ హాస్పిటల్ తెలిపింది. నాలుగు రోజులుగా పొత్తికడుపు వాపు, వాంతులతో బాధపడుతున్న 45 రోజుల పసికందును మెడికవర్‌కు తీసుకువచ్చారు. అక్కడ డాక్టర్ మధు మోహన్ రెడ్డి సీనియర్ పీడియాట్రిక్ సర్జన్‌ని సంప్రదించడం జరిగింది. "శిశువుకి తగిన పరీక్షలు నిర్వహించగా.. శిశువు మూత్ర వ్యవస్థ, వెన్నెముకతో సమస్యలు, ఆమె జననేంద్రియ ప్రాంతానికి సంబంధించిన సమస్యలు వెల్లడైంది. శిశువుకు యోని తెరవకుండా, కాళ్ల మధ్య భాగంలో ఒకే ఓపెనింగ్ ఉన్నట్లు కనుగొనబడింది. పాప కిడ్నీని మూత్రాశయంతో కలిపే ట్యూబ్‌లలో సమస్యలు ఉన్నాయని, దీని వల్ల కిడ్నీలు, మూత్ర వ్యవస్థలో వాపు ఏర్పడిందని పరీక్షల్లో తేలింది. ఆమె యోని ప్రాంతం పునర్నిర్మాణంతో పాటు యోని వెనుక భాగంలో కొత్త ఓపెనింగ్ సృష్టించబడింది. ఈ అరుదైన సర్జరీకి 5 గంటల సమయం పట్టింది. శస్త్రచికిత్స విజయవంతమైంది. ఎటువంటి సమస్యలు లేవు." అని డాక్టర్ మధు మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సర్జరీలో గైనకాలజిస్ట్ డాక్టర్ వరలక్ష్మీ, డాక్టరు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, సంధ్య, హర్షిత పాల్గొన్నారు .

వోగ్ ఐవేర్‌కు తాప్సీ ప్రచారం

న్యూఢిల్లీ : ఫ్యాషనబుల్ ఐవేర్‌గా గుర్తింపు పొందిన వోగ్ ఐవేర్‌కు కీప్ ప్లేయింగ్' పేరుతో తమ బ్రాండ్ అంబాసిడర్ తాప్సీ పన్ను సరికొత్త ప్రచార క్యాంపెయిన్‌ను చేయనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. జీవితాల్లో ప్రతీ రోజు ఎన్నో సవాళ్లు ఉంటాయని.. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ నిరంతరం ఉల్లాసంగా ఉండాలనే సారాంశంతో క్యాంపెయిన్ చేపడుతున్నట్లు ఆ సంస్థ హెడ్ గుంజన్ సైగల్ పేర్కొన్నారు. దీనికి "కీప్ ప్లేయింగ్" అనే పేరుతో క్యాంపెయిన్ చేస్తున్నట్లు పేర్కొంది.

మహారాజశ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో : డోన్.

O.S.No. 444/2023

పి. వెంకటేశ్వరి ... వాది

V/s.

వై. కిరణ్‌కుమార్, తండ్రి వై. రాజగోపాల్, వయస్సు 50 సం॥, హిందూ, Govt. Employee, Working as Superindent, Planning Section, 2nd Floor, Telangana Police Head Quarters, DGP Office, హైదరాబాద్, తెలంగాణ. ఇంటి నెం. 2-3-647-ఎ8/5311, ప్రేమ్‌నగర్, అంబర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం-500013. ... ప్రతివాది

దావాసమను

పై నంబరు దావా నందు వాది, ప్రతివాది అయిన మీ పై ప్రాంసరీనోటు మొత్తం రాబట్టుకొనుటకు గాను దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా వాయిదా 28-06-2024 వ తేదీన వున్నది. పై తేదీన ఉదయం 10-30 గంటలకు మీరుగాని మీ తరపున న్యాయవాది కాని హాజరయ్యి ఏమైన ఆక్షేపణలు వున్నయెడల పై కోర్టు వారికి తెలియచేసుకొనవలెయును లేనిచో సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 28-06-2024

ఎ.సి. వెంకటేశ్వర్లు, B.A. B.L.
అర్జిదారు పరము న్యాయవాది, డోన్.
సెల్ నంబర్ : 9396388037

త్వరలో ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులు

- టెట్ లేకుండా ప్రమోషన్ ఇవ్వాలన్న హైకోర్టు
- ఇసి అనుమతితో ప్రక్రియ చేపట్టనున్న విద్యాశాఖ
- షెడ్యూల్‌పై కసరత్తు ప్రారంభించిన అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించి న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. 2010, ఆగస్టు 23 కంటే ముందుగానే నియామకమైన టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) లేకుండా పదోన్నతులు ఇవ్వాలంటూ హైకోర్టు ఇటీవల మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. ఇంకోవైపు ప్రధానోపాధ్యాయులు, పాఠశాల స్థాయి మారిన సందర్భంలోనే టెట్ అవసరమంటూ జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సిటిఇ) వివరణ ఉత్తర్వులను విడుదల చేసింది. దీంతో ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులకు ఉన్న ఆటంకాలన్నీ తొలగిపోయాయి. ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియను త్వరలోనే చేపట్టే అవకాశమున్నది. ఈ దిశగా పాఠశాల విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉద్యోగోన్నతులు, బదిలీలకు సంబంధించిన షెడ్యూల్ రూపకల్పనలో ఉన్నారు. అయితే రాష్ట్రంలో ఈనెల 13న పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులు, బదిలీలకు సంబంధించి ఎన్నికల కమిషన్ (ఇసి) అనుమతి తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ఇసి నుంచి ఆమోదం లభించగానే షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశమున్నది. అయితే మల్టీజోన్-2 పరిధిలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులకు, మల్టీజోన్-1 పరిధిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు గెజిటెడ్ హెడ్మాస్టర్ (జిహెచ్‌ఎం) గ్రేడ్-2 జిహెచ్‌ఎం పదోన్నతులను కల్పించిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాలతో మల్టీజోన్-2 పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల జిహెచ్‌ఎం ఉద్యోగోన్నతులు నిలిచిపోయాయి. ఇప్పుడు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఉపాధ్యాయ పదోన్నతులు చేపట్టేందుకు అవకాశమున్నది. స్కూల్ అసిస్టెంట్ నుంచి జీహెచ్‌ఎం పదోన్నతులు, సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జిటి) నుంచి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులు చేపట్టాలి. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలకు బదిలీలు నిర్వహించాలి. సీనియార్టీ జాబితా సిద్ధంగా ఉందనీ, వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పిస్తే వీలైనంత త్వరగానే పదోన్నతుల ప్రక్రియ పూర్తవుతుందని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఇసి అనుమతి లభించగానే పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను విద్యాశాఖ విడుదల చేయనుంది.

విద్యాశాఖ కార్యదర్శికి యుఎస్‌పిసి, జాక్టో వినతి

ఉపాధ్యాయుల పదోన్నతులకు న్యాయపరమైన ఆటంకాలు తొలగిపోయినందున ఉద్యోగోన్నతులు, బదిలీలు, బదిలీ అయిన వారి విడుదలకు ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని వీలైనంత త్వరగా షెడ్యూల్‌ను విడుదల చేసి పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తి చేయటానికి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అంగీకరించారని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి), ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) తెలిపాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కలిసి విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో చర్చించి నిర్దిష్టమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని సూచించి వెంటనే విద్యాశాఖ కార్యదర్శికి సీఎం ఫోన్ చేసి ఆదేశించారు. ముఖ్యమంత్రి సూచన మేరకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, యూఎస్‌పీసీ, జాక్టో నాయకులు కె జంగయ్య, వై అశోక్ కుమార్, టి లింగారెడ్డి, జి సదానందం గౌడ్, ఎం రాధాకృష్ణ, యు పోచయ్య, కొమ్ము రమేశ్, కె కృష్ణుడు, జాడి రాజన్న, బి కొండయ్య, ఎస్ హరికృష్ణ, జె వెంకట్రావ్, చావ రవి, పి నాగిరెడ్డి, ఎం సోమయ్య, వి శ్రీను నాయక్, గీతాంజలి, వెంకన్న, లక్ష్మారెడ్డి గురువారం మధ్యాహ్నం సచివాలయంలో బుర్రాం వెంకటేశాన్ని కలిసి చర్చలు జరిపారు.

2010, ఆగస్టు 23కు ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్‌తో నిమిత్తం లేకుండా ఉద్యోగోన్నతులంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని వారు తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు, పాఠశాల స్థాయి మారిన సందర్భంలో మాత్రమే టెట్ అవసరమంటూ ఎన్‌సిటిఇ వివరణ ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. ఉద్యోగోన్నతులకు గల ఆటంకాలన్నీ తొలగిపోయాయని వివరించారు. ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని బదిలీ అయి రిలీవ్ కాకుండా ఉన్న ఉపాధ్యాయులను వెంటనే విడుదల చేస్తామని విద్యాశాఖ కార్యదర్శి హామీ ఇచ్చారని తెలిపారు. మోడల్ స్కూళ్లు, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను పునఃప్రారంభంలోగా చేపడతామన్నారని పేర్కొన్నారు. సిఎం సూచన మేరకు ఆయా శాఖల అధికారులతో మాట్లాడతానన్నారని తెలిపారు. పాఠశాలల్లో సర్వీసు పర్సన్ల నియామకం, ఉచిత విద్యుత్తుపై నిర్ణయం తీసుకున్నామన్నారని పేర్కొన్నారు. పర్యవేక్షణాధికారుల పదవుల భర్తీపై న్యాయ సలహాలు తీసుకుని ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని వెల్లడించారని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులను, సంఘ నాయకులు ప్రేరేపించాలని సూచించారని పేర్కొన్నారు. ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యాలయాలను తలదన్నే రీతిలో ఉన్నాయనీ, అదే మోడల్‌ను తెలంగాణలో అమలు జరపాలనుకుంటున్నామన్నారని వివరించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులను పాఠశాలల సందర్శనకు ఢిల్లీ తీసుకెళ్లే ఆలోచన ఉందన్నారని తెలిపారు.

ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డి మాల్ సీజ్

- తాళం వేసిన టిఎస్‌ఆర్‌టిసి, విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్‌ను టిఎస్‌ఆర్‌టిసి విజిలెన్స్ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఉదయం వచ్చిన అధికారులు మైక్ ద్వారా అనౌన్స్ చేసి సాయంత్రం 5.30 గంటల సమయంలో అందులో ఉన్న వాళ్లను బయటకు పంపి ప్రధాన గేటుకు తాళం వేశారు. ఈ మాల్ మాజీ ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరు మీద ఉంది. ఇటీవల మాల్ సీజ్ చేస్తామని అధికారులు ప్రకటించగా, ఎన్నికల వేళ తనపై కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఆర్‌టిసి అధికారులు ఆయన ఆరోపణలపై వివరణ సైతం ఇచ్చారు. తాము చట్ట ప్రకారంగానే మాల్‌పై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో తాజాగా మాల్‌సీజ్ చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కాగా ప్రధాన గేటు ఎదుట అధికారులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రయివేటు లిమిటెడ్ వారు ఒప్పందం ప్రకారం సకాలంలో అద్దె చెల్లించని కారణంగా ఈ షాపింగ్ మాల్‌ను టిఎస్‌ఆర్‌టిసి స్వాధీనం చేసుకున్నట్టు ఫ్లెక్సీలో ప్రకటించారు. స్టాల్ ఓనర్స్, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బేగంపేట ఫ్లైఓవర్‌పై కారు బీభత్సం

- ఇద్దరికి గాయాలు.. భారీగా ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బేగంపేట ఫ్లైఓవర్‌పై గురువారం కారు బీభత్సం సృష్టించింది. ప్రయివేటు బస్సును ఢీకొట్టిన కారు అనంతరం ఫ్లైఓవర్ వాల్‌ను తాకింది. దాంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వాహనాదారులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్ట వైపు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ తరువాత ట్రావెల్స్ బస్సును ఢీకొని, ఫ్లైఓవర్ వాల్‌కు గుద్దుకుంది. దాంతో కారు డ్రైవర్, ఓ మహిళకు గాయాలయ్యాయి. కారు ముందు భాగం దెబ్బతింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ఫ్లై ఓవర్‌పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

వేసవిలో విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

- బిబిజి సిఎండి మల్లికార్జున రెడ్డి

హైదరాబాద్ : ప్రస్తుత వేసవి కాలాన్ని విద్యార్థులు జ్ఞానం, నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఉపయోగించుకోవాలని బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ (బిబిజి) సిఎండి మల్లికార్జున రెడ్డి అన్నారు. సెలవులు అంటే విద్యార్థులు ఎగిరిగంతేస్తారన్నారు. అయితే సెలవులను సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ విరామ సమయాన్ని సృజనాత్మకంగా మార్చడానికి బిబిజి బంగారుతల్లి వేసవి ప్రత్యేక వీడియోలు, కార్యకలాపాలు' ను ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా సమాచారం, విద్యా వీడియోలు, పాడ్‌క్యాస్ట్‌లు, జికె క్విజ్ పోటీల ద్వారా విద్యార్థులు జ్ఞానం, నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంలో సహాయపడనున్నామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంసిద్ధత తదితర అంశాలు అందించనున్నామని తెలిపారు.

బలమైన వృద్ధి లక్ష్యం : గ్రోయింగ్టన్ వెంచర్స్

ముంబయి : రాబోయే కాలంలో బలమైన వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని గ్రోయింగ్టన్ వెంచర్స్ ఇండియా లిమిటెడ్ తెలిపింది. డిసెంబర్ 2023తో ముగిసిన తొమ్మిది మాసాల కాలంలో 163 శాతం వృద్ధితో రూ.23.81 కోట్ల ఆదాయాన్ని.. 328 శాతం పెరుగుదలతో రూ.1.78 కోట్ల నికర లాభాలు సాధించినట్లు తెలిపింది. తాజా పండ్లు ఉత్పత్తిదారుల నుంచి దిగుమతి చేసుకుని.. వాటిని 'గ్రోఫామియో' అనే బ్రాండుతో హాస్పిటాలిటీ రంగంగలోని కార్పొరేట్‌లకు, ఈ కామర్స్‌కు పంపిణీ చేస్తోన్నట్లు తెలిపింది.

40 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి

- పిఆర్‌సి ఛైర్మన్‌కు ఆర్‌యుపిపిటిఎస్ ప్రతిపాదనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 40 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పిఆర్‌సిని ప్రకటించాలని ఆర్‌యుపిపిటిఎస్ కోరింది. ఈ మేరకు పిఆర్‌సి కమిటీ చైర్మన్ ఎన్ శివశంకర్, సభ్యులు బి రామయ్యను గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు, కోశాధికారి కట్టా గిరిజారమణశర్మ నేతృత్వంలో కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. మాస్టర్ స్కేల్‌ను 32 గ్రేడ్లుగా 84 సెగ్మెంట్లుగా కొనసాగించాలని కోరారు. గతేడాది జులై ఒకటి నాటికి విడుదల కావాల్సిన డిఎను అనుమతిస్తూ బేసిక్‌పేతో కలిపి నూతన స్కేళ్లను నిర్ణయించాలని సూచించారు. హెచ్‌ఆర్‌ఎ గ్రామీణ ప్రాంతాలకు 20 శాతం, పట్టణాలకు 21 శాతం, కార్పొరేషన్లకు 25 శాతంగా అనుమతించాలని తెలిపారు. గ్రామాల్లో ఉన్న సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని పట్టణాలకు హెచ్‌ఆర్‌ఏను తగ్గించాలని సూచించారు. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంను 5/10/15/20/25 ఏళ్లుగా సవరించాలని పేర్కొన్నారు. గ్రేడ్-2 పండితులు ఉన్నత తరగతులకు బోధించేందుకు ఇస్తున్న అలవెన్సును శాస్త్రీయంగా లెక్కించి స్కూల్ అసిస్టెంట్ మినిమం బేసిక్ పేలో 20 శాతంగా అనుమతించాలని కోరారు. గ్రేడ్-2 భాషాపండితులు, పిఇటిల పోస్టులను స్కూల్ అసిస్టెంట్ స్థాయికి పెంచాలని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ భాషాపండితులకు జిహెచ్‌ఎం పోస్టుల్లో అసంబద్ధంగా ఉన్న 10+2+3 విధానాన్ని తొలగించాలని పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు 1.5 శాతం కాంట్రిబ్యూషన్‌తో అమలు చేయాలని తెలిపారు. గ్రాట్యూటీని రూ.30 లక్షలకు పెంచాలని పేర్కొన్నారు. కనీస పెన్షన్ రూ.25 వేలు ఇవ్వాలని సూచించారు. ప్రయివేటు పాఠశాలల నియంత్రణకు బిల్లు తేవాలని కోరారు. ఐదెకరాల స్థలంలో ఉన్న ఉన్నత పాఠశాలలను గురుకులాలుగా అభివృద్ధి చేసి వాటిని పాఠశాల విద్యాశాఖ



పిఆర్‌సి కమిటీ చైర్మన్ ఎన్ శివశంకర్‌కు ప్రతిపాదనలు అందజేస్తున్న ఆర్‌యుపిపిటిఎస్ సభ్యులు

భారీ విస్తరణలో దీసవాలా రబ్బర్ ఇండస్ట్రీస్

- హైదరాబాద్‌లో మరో రెండు ప్లాంట్ల ఏర్పాటు
- రూ.80 కోట్ల పెట్టుబడులు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

రబ్బరు సీలింగ్ రింగ్‌లు, రబ్బరు గ్యాస్కట్లు, ఇతర రబ్బరు ఉత్పత్తుల తయారీలో ఉన్న దీసవాలా రబ్బర్ ఇండస్ట్రీస్ హైదరాబాద్‌లో కొత్తగా రెండు ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే బాలానగర్‌లో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మూడు తయారీ యూనిట్లు ఉన్నాయని పేర్కొంది. గురువారం హైదరాబాద్‌లో ఆ కంపెనీ కో ఫౌండర్, ఎండి హునేడ్ దీసవాలా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముర్తాజా దీసవాలా మీడియాతో మాట్లాడారు. మేడ్చల్ సమీపంలోని కాళ్లకల్‌లో 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కంపెనీ తమ 4వ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీనికి రూ.40 కోట్ల పెట్టుబడి వ్యయం చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది మరో ప్లాంట్‌నూ ఇదే వ్యయంతో అందుబాటులోకి తేనున్నామని తెలిపారు. రెండు ప్లాంట్లపై దాదాపు రూ.80వేల కోట్లు వ్యయం చేయనున్నామన్నారు. ప్రస్తుతమున్న ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజుకు 7-8 టన్నుల నుండి రోజుకు 25 టన్నులకు చేర్చనున్నామన్నారు. ప్రక్కనే ఉన్న యూనిట్‌ను కొనుగోలు చేయడంతో ద్వారా 2025 నాటికి 5వ యూనిట్ కార్యకలాపాలు నిర్వహించటానికి అందుబాటులోకి రానుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో రూ.100 కోట్ల రెవెన్యూ సాధించామని.. వచ్చే రెండేళ్లలో రెట్టింపు కానుందన్నారు.

విద్యుద్ఘాతంతో ఇద్దరు మృతి

- బట్టలు ఆరేస్తుండగా మహిళకు కరెంట్ షాక్
- రక్షించబోయి ఆమె మరిది కొడుకు దుర్మరణం
- మెదక్ జిల్లా విషాదకరమైన ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానెమ్మ, బానుప్రసాద్ (ఫైల్)

కరెంటు షాక్ గురయిన మహిళను రక్షించబోయి ఆమె మరిది కొడుకు కరెంట్ షాక్ తగిలి వారిద్దరూ మృతి చెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని ఉసిరికపల్లి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీరుడి మానెమ్మ (45) రోజు మాదిరిగానే ఇంటి ముందు బట్టలు ఆరపెడుతుండగా దండెం తీగకు కరెంట్ పాస్ అయ్యి ఆమె షాక్‌కు గురైంది. మానెమ్మను కాపాడడానికి ఆమె మరిది కొడుకు బానుప్రసాద్ (19) రక్షించేందుకు వెళ్లి ఆమెను పట్టుకున్నాడు. దీంతో అతనికీ విద్యుత్తు షాక్ తగిలింది. వారిద్దరిని కాపాడేందుకు వెళ్లిన మానెమ్మ కుమార్తె లలితకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మానెమ్మ, భానుప్రసాద్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అందరిలో కలుపుగోలుగా ఉండే పెద్దమ్మ కొడుకులిద్దరూ కరెంట్ షాక్‌తో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని శివ్వంపేట పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

వేడి నీళ్లు పడి విద్యార్థినికి గాయాలు

- ఇక్ఫాయ్ బిజినెస్ యూనివర్సిటీలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాగా కాగిన వేడి నీళ్లతో స్నానం చేయడంతో విద్యార్థినికి తీవ్ర గాయాలయిన ఘటన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం దొంతంపల్లి వద్దనున్న ఇక్ఫాయ్ బిజినెస్ యూనివర్సిటీలో జరిగింది. మోకిలా ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన ఆర్.లోక్య ఇక్ఫాయ్ బిజినెస్ యూనివర్సిటీలో లా ఫైనల్ ఇయర్ చదువుతోంది. బుధవారం రాత్రి 7:30 గంటలకు స్నానం చేద్దామని వేడి నీళ్లు పెట్టుకుంది. స్నానం చేద్దామని వెళ్లి ఆ వేడి నీటి గురించి మరచిపోయి అలాగే ఒంటిపై పోసుకుంది. దాంతో కాళ్లు, చేతులు, వీపుపైన కాలి బొబ్బలు వచ్చాయి. గాయాలు తట్టుకోలేక ఆమె అరుపులు, కేకలు వేసింది. వెంటనే హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు స్పందించి ఆమెకు క్యాంపస్‌లోనే ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అయితే విద్యార్థిని స్నానం చేసే బాకెట్‌లో ఎవరో యాసిడ్ కలిసినట్టు వార్తలు వినిపించాయి. సోషల్ మీడియాలోనూ ప్రచారం జరిగింది. ఇదే విషయంపై ఎస్‌ఐని వివరణ కోరగా ఆయన ఖండించారు. కొంతమంది సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని, కేవలం వేడి నీళ్లు పడటంతోనే విద్యార్థికి గాయాలయ్యాయని ఎస్‌ఐ స్పష్టం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలి

- విద్యాశాఖ కార్యదర్శికి పిఆర్‌టియుటిఎస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతంలో నిలిచిపోయిన బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. టెట్‌తో నిమిత్తం లేకుండా ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించాలని కోరారు. గతంలో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని సూచించారు. దీనికి స్పందించిన విద్యాశాఖ కార్యదర్శి ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని ప్రక్రియను పూర్తి చేస్తామంటూ హామీ ఇచ్చారని తెలిపారు.

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

టెట్ విషయంలో సరైన సమాచారాన్ని అందించకుండా ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేసిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, అదనపు సంచాలకులు లింగయ్యపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని పిఆర్‌టియుఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు డిమాండ్ చేశారు. విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉండకుండా ఉపాధ్యాయ సమస్యలను పట్టించుకోకుండా పలు అక్రమాలకు పాల్పడిన వారిపై విచారణ చేపట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ నేతలు ఇన్నారెడ్డి, రామేశ్వర్‌గౌడ్, శశిధర్‌శర్మ, ఆనంద్‌రెడ్డి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులు, లబ్ధిదారుల మధ్య నిత్యం గొడవలే

- గజ్వేల్‌లోని డబుల్ ఇళ్లు ఖాళీచేయాలని.. మల్లన్నసాగర్ నిర్వాసితులపై లబ్ధిదారుల ఒత్తిడి
- గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ప్రజలకు అవస్థలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 'డబుల్' ఇళ్ల సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. ప్యాకేజీ సమస్యలు పరిష్కరించేవరకు ఇళ్లు ఖాళీ చేసేదిలేదని అందులో తాత్కాలికంగా నివాసముంటున్న మల్లన్నసాగర్ నిర్వాసితులు చెబుతుండగా, మరోవైపు ఎంపికైన లబ్దిదారులు గృహ ప్రవేశాల కోసం ఆందోళన బాట పట్టారు. కాగా, మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇస్తామన్న పరిహారం పూర్తిగా అందేవరకు తాత్కాలికంగా ఇళ్లు కేటాయించిన గత ప్రభుత్వం.. వారి సమస్యలను పరిష్కరించడంలో వెనకడుగు వేసింది. దాంతో లబ్దిదారులు ఇండ్లు ఖాళీ చేసి తమకు ఇవ్వాలని ఆందోళన చేస్తున్నారు. దాంతో తాజాగా రెవెన్యూ అధికారులు.. ముంపు గ్రామాల్లో సర్వే నిర్వహించగా.. తమ ప్యాకేజీ సమస్యలతో పాటు ప్లాట్లు కేటాయిస్తే ఇళ్లు ఖాళీ చేస్తామని నిర్వాసితులు చెబుతున్నట్టు సమాచారం.

మాజీ సిఎం కెసిఆర్ తన సొంత నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి మొత్తం 1,250 ఇళ్ల మోడల్ కాలనీని మంజూరు చేశారు. ఈ కాలనీ 156 బ్లాకులుగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఒక్కో బ్లాకులో కింద నాలుగు, పైన నాలుగు రెండు ఫ్లోర్లుగా నిర్మాణం జరిగింది. ఒక్కో ఇల్లు 570 చదరపు గజాల విస్తీర్ణంలో కాలనీలో అన్ని రకాల వసతులను కల్పించారు. పంపిణీ వ్యవహారం ఏళ్ల తరబడి నానుతూ వస్తోంది. వివిధ రకాల ఆందోళనల తర్వాత 2023 మార్చి 21న డ్రా నిర్వహించి 1100 మందిని ఎంపిక చేశారు. మోడల్ కాలనీలో 1250 ఇల్లు ఉండగా.. వాటిలో పట్టణ పేదలకు 1100 ఇళు ఇవ్వాలని, మిగతా వాటిని భూ నిర్వాసితులు, ఆస్తులు కోల్పోయిన వారికి ఇవ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు అంతమందినే ఎంపిక చేశారు. కాగా, మల్లన్నసాగర్ కాలువల నిర్మాణానికి ముంపు గ్రామాలను ఖాళీ చేయించి వారిని గజ్వేల్‌లోని డబుల్ ఇళ్లకు తాత్కాలికంగా చేర్చారు. కానీ ప్రస్తుతం వారు ఇళ్లు ఖాళీ చేయడానికి మోరాయించడంతో నిర్వాసితులకు, ఇల్లు కేటాయించిన నిరుపేదలకు మధ్యన వార్ కొనసాగుతుంది. ఈ క్రమంలోనే పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో లబ్దిదారులు ధర్నా, రాస్తారోకో చేపట్టిన విషయం తెలిసిందే. దాంతో ఉన్నత అధికారుల ఆదేశానుసారం.. రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు.. ముంపు గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఇప్పటివరకు 500 కుటుంబాలకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయినట్టుగా తెలుస్తోంది. మిగతా ముంపు గ్రామాలు ఎర్రవల్లి, పల్లెపహాడ్, సింగారం, బ్రహ్మణబంజేరుపల్లి, లక్ష్మాపూర్ తదితర గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారు. ఈ లోపు పార్లమెంట్ ఎన్నికల రావడంతో మరికొంత పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. దీని ద్వారా సమస్యలపై స్పష్టత వస్తే ఎలాంటి కారణాలు లేకుండా తాత్కాలికంగా నివాసముంటున్న వారిని ముందుగా కాలనీలోంచి వెంటనే ఖాళీ చేయించడానికి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. అదేవిధంగా ఇతర సమస్యలపైనా అధ్యయనం చేసి వెంటనే పరిష్కారానికి అవకాశముందా? ఆర్థిక అంశాలపై ముడిపడి ఉన్నాయా..? అనే అంశంపైనా స్పష్టత కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ప్యాకేజీలు ప్లాట్లు ఇస్తే తాము ఖాళీ చేస్తామని మల్లన్న సాగర్ నిర్వాసితులు తెలిపారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికీ తీసుకుపోతామని అధికారులు చెబుతున్నారు.

ఎసిబి వలలో విద్యుత్ ఉద్యోగి

- ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలకు రూ.50 వేలు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లంచం తీసుకుంటూ విద్యుత్ ఉద్యోగి ఎసిబి వలలో చిక్కాడు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని మల్లారెడ్డిపెల్లి గ్రామానికి చెందిన ఆర్టిజన్ గ్రేడ్ 2 ఉద్యోగి నడింపల్లి వేణు మూడేండ్ల నుంచి అక్కడే విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన రాయి సూర్యనారాయణ తన వ్యవసాయ భూమిలో ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు, విద్యుత్ వైర్లు వేసేందుకు వేణును కలిశాడు. అందుకు రూ.50 వేల లంచం ఇవ్వాలని సూర్యనారాయణను అడిగాడు. వారం రోజుల్లో మొదటగా రూ.20 వేలివ్వాలని, పని పూర్తి చేయగానే మిగతా రూ.30 వేలు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ విషయంపై సూర్యనారాయణ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ప్లాన్ ప్రకారం గురువారం సాయిబాబా గుడి వద్ద విద్యుత్ ఉద్యోగికి రూ.20 వేలు ఇస్తుండగా అక్కడే మాటువేసి ఉన్న ఎసిబి డిఎస్‌పి జగదీష్, అధికారులు వెంకట్ రెడ్డి, రామారావు పట్టుకున్నారు. వేణును అదుపులోకి తీసుకుని నాంపల్లి కోర్టుకు తరలించినట్టు ఎసిబి డిఎస్‌పి జగదీష్ తెలిపారు.